కళా విహీనం.. మినీ ట్యాంక్ బండ్



ఆలేరు మండలం కొలనుపాక పిన్న చెరువును 2017లో మినీ ట్యాంక్ బండ్‌గా ఎంపిక చేసి అభివృద్ధి చేశారు. మొదటి విడతగా రూ.3 కోట్లకు పైగా ఖర్చు చేశారు. కట్ట వెడల్పు, కట్ట లోపలి వైపున రివిట్‌మెంట్, ఇనుప జాలీలతో రెయిలింగ్ పనులు చేశారు. మరో రూ.2 కోట్లతో కట్టపై సీసీ రోడ్డు, విద్యుద్దీకరణ, సుందరీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. నిధులు మంజూరు కాకపోవడంతో కట్టకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగాయి. అప్పట్లో కట్టపై నాలుగు చక్రాల వాహనాలు సులువుగా ప్రయాణించేవి. మిగతా అభివృద్ధి పనులు జరగకపోవడంతో కంపచెట్లతో కళా విహీనంగా మారింది. – న్యూస్‌టుడే, ఆలేరు

నేడు లోక్ అదాలత్

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లాలోని అన్ని కోర్టుల్లో శనివారం లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు ఎ.జయరాజు ప్రకటనలో తెలిపారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్, చెక్‌బౌన్స్, బ్యాంకు లావాదేవీలు, టెలిఫోన్ బకాయిలు, ట్రాఫిక్ చలానా, ఈ పెట్టి కేసులు, మోటారు వాహన ప్రమాద నష్టపరిహారం, ఎక్సైజ్ కేసులు పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాగుతున్న నూనెలు


భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: పండగల వేళ వంట నూనె ధరలు అనూహ్యంగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దసరా, దీపావళి సమయంలో వంటనూనెల ధరలు ఆకాశాన్నంటడంతో పిండి వంటలు చేసుకుంటే ఆర్థిక భారం పెరగనుంది.



ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా సుమారు 12,00609 కుటుంబాలు ఉన్నట్లు అంచనాగా ఉంది. పండగ వేళల్లో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఐదు లీటర్ల నూనెను కొనుగోలు చేస్తుంటారు.

❑ 20 రోజుల నుంచి అన్ని రకాల వంట నూనెల ధరలు క్రమంగా 30 నుంచి 40 శాతం వరకు పెరిగాయి. ప్రజలు, చిరు హోటళ్ల వ్యాపారులు నిత్యం వినియోగించే పామాయిల్, రిఫైన్డ్ ధరలు గణనీయంగా పెరిగాయి. గతంలో రూ.85 లీటరు ఉన్న పామాయిల్ ఇప్పుడు రూ.120కి చేరింది. సన్‌ఫ్లవర్ నూనె రూ.108 నుంచి రూ.165కి, వేరు శెనగనూనె రూ.165కి, దీపం నూనె రూ.110 నుంచి రూ.150కి పెరిగింది. గత కొద్ది నెలలుగా వంటనూనె ధరలు పెరగడమే తప్ప తగ్గడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. దిగుమతి పన్ను, సుంకం తగ్గించే వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

బాధ్యతలు స్వీకరించిన డీఈవో



డీఈవో కందుల సత్యనారాయణ

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: భువనగిరి ఇన్‌ఛార్జి జిల్లా విద్యాశాఖాధికారిగా కందుల సత్యనారాయణ నియమితులయ్యారు. శుక్రవారం ఆయన కలెక్టర్ హన్మంత్ కె.జెండగేను కలిసి పూల మొక్క అందజేశారు. వరంగల్ డీఈవో కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న ఆయనను ఇక్కడ డీఈవోగా నియమించారు. గత కొద్ది నెలల్లోనే ముగ్గురు డీఈవోలు నియమితులు కావడం విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది. డీఈవో నారాయణరెడ్డి, తదుపరి ఏడీగా పనిచేస్తున్న ప్రశాంత్‌రెడ్డి ఇన్‌ఛార్జి డీఈవోలుగా పనిచేశారు. అనంతరం ఇన్‌ఛార్జి డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన కానుగుల నర్సింహ కొద్ది రోజుల వ్యవధిలోనే పదవి నుంచి తప్పుకొన్నారు. అనారోగ్య కారణాలతో కొందరు, ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీల్లో అవినీతి, అక్రమాల ఆరోపణలు, పని ఒత్తిడి కారణంగా మరి కొందరు బాధ్యతల నుంచి తప్పుకోవడం గమనార్హం. కొత్తగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ ఎంతకాలం పని చేస్తారో అన్న విషయమై విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది.

పట్టదారు పాస్‌పుస్తకం అందేదెప్పుడో..?

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధరణి వెబ్‌సైట్ ద్వారా రోజూ తహసీల్ కార్యాలయాల్లో పదుల సంఖ్యలో భూరిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సాఫీగా సాగుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు అందకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. దాదాపు మూడు నెలలుగా ఈ పరిస్థితి నెలకొనడంతో ఆందోళన చెందుతున్నారు. దరఖాస్తు చేసుకున్న మీసేవ కేంద్రాలకు రోజూ వెళ్తూ రిజిస్ట్రేషన్ జరిగిందా.? అసలు పట్టాదారు పాసు పుస్తకం వస్తుందా.? రాదా? అని ఆరా తీస్తున్నారు.

అన్ని పథకాలకు ప్రామాణికం

రుణమాఫీ, పంట రుణాలు, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, రైతు బీమా, విత్తనాలు, ఎరువుల రాయితీలు, యంత్రపరికరాలు, పాడి పశువులు పంపిణీకి పట్టాదారు పాసు పుస్తకమే ప్రామాణికం. ఉద్యాన పంటలకు ఉపయోగించే బిందు, తుంపర, పాలీ హౌజ్‌లకు సంబంధించి సామగ్రి రాయితీపై మంజూరుకు పాస్‌పుస్తకం ఆధారంగా చూపించాల్సి ఉంటుంది.


ప్రక్రియ ఇలా..

☛ రిజిస్ట్రేషన్లకు ముందు క్రయ విక్రయదారులు మీసేవలో స్లాట్ బుక్ చేయాలి. ఆ సమయానికి తహసీల్ కార్యాలయానికి హాజరై రిజిస్ట్రేషన్ ప్రక్రియకి రుసుములు చెల్లించాలి. ఆ తర్వాత నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేసి అంతర్జాలంలో సీసీఎల్ఏ(భూ పరిపాలన ముఖ్య కమిషనర్) కార్యాలయానికి దస్తావేజు పంపిస్తారు. అక్కడికి వెళ్లిన తర్వాత ప్రభుత్వ అనుమతి ఉన్న ప్రింటింగ్ ప్రెస్ ద్వారా పట్టాదారు పాస్‌పుస్తకంలో వివరాలన్నీ నమోదైన తర్వాత నేరుగా తపాలా శాఖ ద్వారా కొనుగోలుదారు చిరునామాకు చేరుతుంది.

☛ వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు మొత్తం తహసీల్ కార్యాలయంలోనే జరుగుతాయి. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో భాగంగా ప్రభుత్వానికి ఒక్కో ఎకరా మీద రిజిస్ట్రేషన్లు, స్టాంపు డ్యూటీ ఇతరత్రా అన్ని రుసుములు కలిపి గరిష్ఠంగా రూ.20వేల వరకు రైతులు చెల్లించాల్సి వస్తుంది.

☛ గతంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసిన వెంటనే పాస్‌పుస్తకం ఉన్నవారికైతే అందులోనే క్రయ, విక్రయాల వివరాలు కొత్తవి నమోదు చేసి ప్రింట్ తీసి అప్పటికప్పుడే అందించేవారు.

☛ ధరణిలో రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన పక్షం రోజుల్లోపు పట్టాదారు కొత్త పాస్‌పుస్తకం రైతులకు చేరేది. ప్రస్తుత ఆలస్యానికి కొత్త పుస్తకాల కొరత కారణమని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. మూడు నెలలుగా ఉమ్మడి జిల్లాలో దాదాపు 50 వేల మందికి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కావాల్సి ఉంది.



ఉమ్మడి జిల్లాలో సగటున రోజుకు రిజిస్ట్రేషన్లు: 700 వరకు

ప్రభుత్వానికి ప్రతిరోజు వస్తున్న ఆదాయం: రూ.3 కోట్లు

పాస్‌పుస్తకాలకు ఎదురు చూస్తున్న వారు: 50 వేల మంది

అద్దాల మండపంలో అమ్మవారి సేవోత్సవం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పంచనారసింహుల పుణ్యక్షేత్రంలో శుక్రవారం అమ్మవారి ఆరాధనలు ఆలయ ఆచారంగా కొనసాగించారు. గర్భాలయంలో కొలువుదీరిన అర్చామూర్తులను మేల్కొలిపే క్రతువును సుప్రభాతం ద్వారా చేపట్టిన పూజారులు హారతి నివేదనతో కొలిచారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వర్ణ కవచమూర్తులను స్వర్ణ పుష్పాలతో అర్చించారు. మహాముఖ మండపంలో యజ్ఞమూర్తులను ఆరాధిస్తూ స్వర్ణ పుష్పాలతో నిత్యార్జిత అర్చన పర్వాన్ని కొనసాగించారు. అష్టభుజి మండప ప్రాకారంలో శ్రీసుదర్శన నారసింహహోమం, శ్రీలక్ష్మీనారసింహుల నిత్యకల్యాణం శాస్త్రానుసారంగా నిర్వహించారు. కల్యాణమూర్తులను గజవాహనంపై అలంకృతులను చేసి సేవా పర్వాన్ని చేపట్టారు.

✧ శ్రీలక్ష్మీదేవిని అలంకరణతో ముస్తాబు చేసి ఊంజల్ సేవా పర్వం చేపట్టారు. అమ్మవారి సేవను అద్దాల మండపంలోకి చేర్చి, ఊయలపై అధిష్ఠింపజేసి, సేవా కైంకర్యాన్ని వేదమంత్ర పఠనాల మధ్య నిర్వహించారు. పండితులు వేద పఠనం చేయగా, పూజారులు మంత్ర జపం చేస్తూ హారతితో అమ్మవారిని ఆరాధించారు. అమ్మవారి సేవను మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. రాత్రి స్వయంభువులను ఆరాధిస్తూ ప్రత్యేక ఆరాధన, సహస్రనామార్చన జరిపారు. భక్తుల రద్దీ సాధారణంగా నెలకొంది.



అమ్మవారి ఊంజల్ సేవా పర్వం

ఐఐహెచ్‌టీని పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాలి: సునీత

ఆలేరు, న్యూస్‌టుడే: భారాస ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రానికి మంజూరు చేయించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూం టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ)ని ఉమ్మడి నల్గొండ జిల్లాలోని భూదాన్‌పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆలేరులో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని భారాస స్వాగతిస్తుందన్నారు. ఐఐహెచ్‌టీని రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌కు తరలించడం సరికాదన్నారు. మంత్రి కోమటిరెడ్డి ప్రత్యేక దృష్టిని సారించి ఐఐహెచ్‌టీ ఏర్పాటుకు అన్నిరకాల అనుకూలతలు, వసతులు ఉన్న పోచంపల్లిలోనే ఏర్పాటు చేయించాలన్నారు. ఆలేరు పుర ఛైర్మన్ వస్పరి శంకరయ్య, భారాస ఆలేరు పట్టణ, మండల అధ్యక్షులు పుట్ట మల్లేశం, గంగుల శ్రీనివాస్, నాయకులు బొట్ల పరమేశ్వర్, జూకంటి ఉప్పలయ్య, బేతి రాములు, రచ్చ కావ్యశ్రీ, బింగి రవి తదితరులు ఉన్నారు.

ఊరూవాడా.. వానర జాడ



భువనగిరి పట్టణంలో తిరుగుతున్న వానరాల గుంపు

భువనగిరి– న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ఊరూరా.. వాడవాడలా వానరాలు ప్రజలను ముప్పు తిప్పలు పెడుతున్నాయి. ఏటేటా వీటి సంఖ్య పెరుగుతోంది తప్ప తగ్గడం లేదు. నియంత్రణ, అడవులకు తరలించే ఎలాంటి చర్యలు ప్రభుత్వం తీసుకోవడం లేదు. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసి వాటిని నియంత్రించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

★ నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకోవడంతో గుట్టలను పేల్చివేసి.. చెట్లను నరికి చదునుచేసి పాట్లుగా మార్చుతున్నారు. స్థావరాలు లేక, ఆహారం దొరక్క కోతులు జనావాసాల్లోకి వస్తున్నాయి. వందలాది కోతులు దండులుగా గ్రామాలపై విరుచుకుపడున్నాయి. పంట చేనులు.. నాశనం చేస్తున్నాయి. పండ్లతోటల్లో దాడి చేసి పిందె దశలోనే తుంచేస్తున్నాయి. ఆత్మకూర్(ఎం), నారాయణపురం, తుర్కపల్లి, వలిగొండ, గుండాల మండలాల్లో పత్తి చేన్లను నాశనం చేస్తున్నాయి. మెట్ట పంటలైన మొక్కజొన్న, జొన్న, సజ్జ, పంటల సాగునే రైతులు మరిచిపోయారు. కొన్ని పట్టణాల్లో ఇళ్ల తలుపు తీయని పరిస్థితి నెలకొంది. పాఠశాలల వద్ద కాపుకాసి విద్యార్థుల టిఫిన్ బాక్సులను లాక్కెళ్తున్నాయి. కోతులు దాడి చేయడంతో యాదాద్రి భువనగిరి జిల్లాలోనే వందమందికిపైగా గాయపడ్డ సందర్భాలు ఉన్నాయి.

★ గ్రామాల్లోని పెంకుటిళ్లను నాశనం చేస్తున్నాయి. పైకప్పు దెబ్బతిని ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు. టార్పాలిన్ కప్పడంతో పాటు కంప వేస్తున్నారు.

★ యాదాద్రి భువనగిరి జిల్లాలో వలిగొండ, రాజపేట, భువనగిరి పట్టణం, బీబీనగర్, మోత్కూరు, గుండాల, నారాయణపురం, మండలాలల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. నల్గొండ, సూర్యాపేట జిల్లాలోని నల్గొండ, నేరడుచర్ల, తిరుమలగిరి, దేవరకొండ ప్రాంతాల్లోనూ కోతుల సంచారంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.



ఆత్మకూర్ (ఎం) మండలంలో పెంకుటిల్లు కప్పుపై కోతులు పెంకులు తీయకుండా టార్పాలిన్ కప్పి పైన ముళ్లకంపను వేసిన దృశ్యం

పట్టుకున్నా.. మళ్లీ వస్తున్నాయి

భువనగిరి, నల్గొండ, సూర్యాపేట, నేరేడుచర్ల ఉమ్మడి జిల్లాలోని తదితర మున్సిపాలిటీల్లో కోతులను పట్టించేందుకు ఏటా చర్యలు తీసుకుంటున్నా బెడద మాత్రం తీరడంలేదు. భువనగిరి మున్సిపాలిటీల్లో గతంలో అనేక పర్యాయాలు కోతులను పట్టి శ్రీశైలం, ఇతర అడవుల్లో వదిలినా కొన్నాళ్లకే మళ్లీ వస్తున్నాయి. ఒక్కో కోతికి రూ.500 నుంచి రూ.700 వరకు చెల్లించి పట్టిస్తున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోతుంది. 2022లో రూ.6లక్షలు ఖర్చు చేశారు. అయినా ఫలితం శూన్యం.

కోతి కరిచినప్పుడు శుభ్రంగా కడగాలి

– డాక్టర్ ఎం.రాజారావు

అదనపు డీఎంఎ, సూపరింటెండెంట్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, భువనగిరి

కోతులు కరిచినప్పుడు కుక్కకాటుకు తీసుకునే చికిత్సను తీసుకోవాలి. గాయాన్ని నల్లా నీటి ధారగా పడుతుండగా సబ్బుతో శుభ్రంగా కడగాలి. ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి యాంటీ రాబిస్ వ్యాక్సిన్ నాలుగు డోస్‌లు తీసుకోవాలి. గాయం తీవ్రత ఎక్కువగా ఉంటే వైద్యుడి సలహా మేరకు హిమినోగ్లోబిన్స్ ఇంజక్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. కరిచిన గాయాలు మానేందుకు యాంటీబయాటిక్స్ మాత్రలు వేసుకోవాలి.

అన్ని రంగాల్లో రాణిస్తేనే ఎదుగుదల



సైన్స్‌మేళాలోని ప్రదర్శనలు తిలకిస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న


భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: యువత అన్ని రంగాల్లో రాణించి తమ ప్రతిభ చాటుకోవాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కోట ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. విద్యతో పాటు ఇతర రంగాల్లో రాణించినప్పుడే ఎదుగుదల ఉంటుందన్నారు. భువనగిరి కోటను పర్యాటక కేంద్రంగా మలిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సైన్స్ మేళాలోని ప్రదర్శన తిలకించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సుమారు 150 మంది యువతి, యువకులు నృత్యాలు, నాటికలు ప్రదర్శించారు. విజేతలకు నిర్వాహకులు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమాల్లో పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి ధనంజేయులు, వారసత్వ కమిటీ సభ్యులు సద్ది వెంకట్‌రెడ్డి, దిడ్డి బాలాజీ, పురావస్తుశాఖ ఏడీ నాగలక్ష్మి పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థుల విన్యాసం

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

భువనగిరి, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర సాధనకు కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి మరువలేనిదని కలెక్టర్ హన్మంత్ కె.జెండగే అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని మార్గదర్శకంగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమం, 1969లో తెలంగాణ తొలి దశ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి శోభారాణి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి యాదయ్య, వివిధ సంఘాల నాయకులు బాబురావు, నర్సింహ, అశోక్, భట్టు రామచంద్రయ్య, వెంకటేశం, వైకుంఠం, శ్రీరామ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హన్మంత్ కె.జెండగే, అదనపు కలెక్టర్లు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు

ధరణి అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి: అదనపు కలెక్టర్

ఆలేరు, న్యూస్‌టుడే: ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) పి.బెన్‌షాలోమ్ అన్నారు. ఆలేరు తహసీల్ కార్యాలయంలో శుక్రవారం ధరణి పెండింగ్ దరఖాస్తులు, అర్జీల పరిష్కారం, సవరణలపై తహసీల్దారు శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ధరణి పెండింగ్ దరఖాస్తులను రోజువారీ లక్ష్యం ఏర్పరచుకుని పరిష్కరించాలని సూచించారు. జిల్లాలోని 60 మీసేవ కేంద్రాల నిర్వాహకులకు త్వరలో అవగాహన సమావేశం నిర్వహించి ధరణిలో చోటు చేసుకున్న నూతన విధి విధానాలపై అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం శ్రీహిత్ మీసేవ కేంద్రాన్ని తనిఖీచేశారు. నిబంధనల మేరకు రుసుములు వసూలు చేయాలన్నారు. తహసీల్దారు పి.శ్రీనివాస్‌రెడ్డి, ఎంఆర్ఐ ఆర్.పూర్ణచందర్, ఆర్ఐలు పాల్గొన్నారు.



ఆలేరు: మీసేవ కేంద్రం నిర్వాహకునితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

ఆనవాళ్లు ఆక్రమణలో కలిసిపోతున్నాయ్..!



నాగార్జునసాగర్ ఎడమ కాలువపై త్రిపురారం మండలంలో కనీసం వాహనం వెళ్లేందుకు కూడా స్థలం లేని తీరు

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా విజయవాడ, ఖమ్మం జిల్లాల్లో వరదలు వచ్చి ఇళ్లు ముంపునకు గురికాగా.. జనజీవనం అస్తవ్యస్తమైంది.. దీనికి ప్రధాన కారణం కాల్వల ఆక్రమణలే అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాగార్జునసాగర్ ఎడమ కాలువ, మేజర్లు, మైనర్ల పరిధిలో స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఎడమకాలువ నిర్మాణ సమయంలో కాలువకు రెండు వైపులా కనీసం 50 మీటర్ల స్థలం ఉండేలా నిర్ణయించారు. కొన్ని చోట్ల కాల్వ నిర్మాణానికి అవసరమైన మట్టిని తోడేందుకు 10 ఎకరాల మేరకు ఎన్నెస్పీ అధికారులు స్థానికంగా రైతుల నుంచి కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఈ స్థలాలన్నీ ఆక్రమణకు గురయ్యాయి. కాల్వకు రెండు వైపులా ఉన్న రహదారులు సైతం కనుమరుగై పోతున్నాయి. దీంతో ఎడమ కాలువ తెగిన సమయంలో మట్టికోసం దూర ప్రాంతాల నుంచి తరలించాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఎన్నెస్పీ ఆధీనంలో గతంలో సేకరించిన స్థలాలు ఉంటే అక్కడి నుంచే మట్టిని తరలించుకోవచ్చని ఓ అధికారి తెలిపారు.

◆ మేజర్ కాల్వలకు 30 అడుగులు, మైనర్‌లకు కనీసం 15 అడుగుల స్థలం ఉండేలా ఆయా కాల్వల డిజైన్ల ఆధారంగా నిర్ణయించినప్పటికీ.. ప్రస్తుతం ఈ స్థలాలన్నీ కనుమరుగైపోయాయి. గతేడాది ఎడమకాలువ పరిధిలో నీరు విడుదల చేయలేదు. దీంతో మేజర్లు, మైనర్లు వ్యర్థాలతో నిండిపోయాయి. వాటిని శుభ్రం చేసేందుకు యంత్రాలు సైతం కాల్వపైకి తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొంది.

నోటీసులు ఇచ్చాము

జనార్దన్,

నీటిపారుదల విభాగం డీఈ

మైనర్ల పరిధిలోని స్థలాలను రైతులు ఆక్రమించిన విషయమై గ్రామాల్లో నోటీసులు ఇచ్చి, డప్పు చాటింపు చేయించాం. గతంలోని రికార్డుల ఆధారంగా సరిహద్దులు నిర్ణయించి హద్దురాళ్లు అమర్చుతాం.

రైతులు ఆక్రమణలు తొలగించాలి

గోపీనాథ్‌రెడ్డి, ఎన్నెస్పీ డీఈ

ఎడమకాలువ పక్కన ఆక్రమించిన రైతులు స్వచ్ఛందంగా తొలగించాలి. కనీసం స్థలం లేకుండా ఆక్రమించి వ్యవసాయం చేస్తున్నారు. చాలాచోట్ల ఎన్నెస్పీ ఎడమ కాల్వ నిర్మాణ సమయంలో మట్టి తవ్వకం కోసం స్థలాలు ఉన్నాయి. వీటిని సైతం ఆక్రమిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాగార్జునసాగర్ ఎడమకాలువ ఆయకట్టు పరిధిలో 54 మేజర్ కాలువలు ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో 24, నల్గొండ జిల్లాలో 30 మేజర్ కాలువలు ఉన్నాయి. నల్గొండ జిల్లాలో మేజర్ల కింద 98,030 ఎకరాలు, 31 ఎత్తిపోతల పథకాల కింద 47,690 ఎకరాల విస్తీర్ణం సాగుచేస్తున్నారు. సూర్యాపేట జిల్లా పరిధిలో మేజర్లు, ఎత్తిపోతల కింద 2.35 లక్షల ఎకరాల విస్తీర్ణంలో రైతులు ఆయా రకాల పంటలు సాగు చేస్తున్నారు.



మిర్యాలగూడ పట్టణంలోని మేజర్ కాల్వ స్థలంలో ఇళ్ల నిర్మాణాలు

వయోవృద్ధుల దినోత్సవం

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ శివారులోని రాయగిరిలోని సహృదయ వృద్ధాశ్రమంలో వృద్ధులకు శుక్రవారం వాకథాన్ నిర్వహించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ, వికలాంగులు, వయోవృద్ధుల శాఖాధికారి నర్సింహారావు మాట్లాడుతూ.. వయోవృద్ధుల సంక్షేమానికి శాఖాపరమైన సాయం అందిస్తామన్నారు. వయోవృద్ధుల రక్షణ, హక్కులు, ప్రభుత్వం నుంచి అందే ఫలాల గురించి వివరించారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులందరికీ పండ్లు పంచారు. కార్యక్రమంలో వయోవృద్ధుల అసోసియేషన్ సభ్యుడు పోలి శంకర్‌రెడ్డి, బాలేశ్వర్, అంజయ్య, శ్రీనివాస్, సీడీపీవోలు శైలజ, స్వరాజ్యం, సూపరింటెండెంట్ శశికళ తదితరులు పాల్గొన్నారు.



వాకథాన్ నిర్వహిస్తున్న జిల్లా సంక్షేమాధికారి నర్సింహారావు

యువ హృదయాలు ఉప్పొంగె..!

నల్గొండ జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో నల్గొండ పట్టణంలోని కేపీఎం ప్రభుత్వ జూని యర్ కళాశాలలో శుక్రవారం జిల్లాస్థాయి యువజనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు అధికారులు పాల్గొని క్రీడల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఆయా కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.
– న్యూస్‌టుడే, నల్గొండ టౌన్, ఈనాడు, నల్గొండ


ఉల్లాసం.. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థుల నృత్యం


కోలాటం.. దేవరకొండ గురుకుల కళాశాల విద్యార్థుల ప్రదర్శన


దరహాసం.. దేవరకొండ కేజీబీవీ విద్యార్థినుల ప్రదర్శన


ఉత్సాహం.. పాల్గొన్న విద్యార్థులు

నాటి ప్రతిభకు తార్కాణం..

నేటికీ చెక్కుచెదరని వైనం

నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు సూర్యాపేట జిల్లా శివారు కాగితరామచంద్రాపురం సమీపంలో ఖమ్మం జిల్లా నాయకన్‌గూడెం చెరువులో నాటి ఇంజినీర్ల ప్రతిభకు తార్కాణంగా నిలిచింది ఈ రోడ్డు వారధి. ఇక్కడ సాగర్ ఎడమ కాల్వ కట్ట రెండు వైపుల నుంచి వచ్చే రహదారి కలిసేలా వారధి నిర్మాణం చేపట్టారు. పైనుంచి నాలుగు వైపుల రహదారి, కింద నుంచి సాగర్ నీరు ఖమ్మం జిల్లాకు ప్రవహించేలా వారధి నిర్మాణం చేపట్టారు. ఇక్కడ నాలుగు రహదారులు కలుస్తుండటంతో వారధికి ఉన్న రక్షణ గోడలను గుర్తించేలా రకరకాల రంగులు వేశారు. దీంతో దీనికి రంగుల వారధిగా పేరు వచ్చింది. ఈ కట్టడం నేటికీ చూపరులను ఎంతో ఆకర్షిస్తుంది. కాల్వ పైనుంచి రెండు రహదారులు వెళ్లడం, కింద నుంచి నీరు ప్రవహించే తీరు దర్శనీయం ప్రాంతంగా గుర్తింపు తెచ్చింది.



–నడిగూడెం, కోదాడ, న్యూస్‌టుడే:

ఆడాలనే ఆసక్తి.. అడుగెయ్యలేని దుస్థితి

సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్: చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ప్రాణంగా పెరిగాడు ఆ కుర్రాడు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సత్తా చాటాడు. తాజాగా అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం దక్కించుకున్నాడు. కానీ ఆ ఎంపికలకు వెళ్లేందుకు చేతిలో చిల్లిగవ్వ లేదు. ఆడాలనే ఆసక్తి, పాల్గొనే అవకాశమున్నా ఆర్థిక స్థితి సహకరించక సతమతమవుతున్నాడు.

✦ సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జ గ్రామానికి చెందిన గోపరాజు భిక్షపతి-కవితల కుమారుడు అర్జున్ అంతర్జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతూ క్రికెట్‌లో రాణిస్తూ పలు రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చాటుకుంటున్నాడు. ఇటీవలే చెన్నై, మధ్యప్రదేశ్‌లో రాష్ట్రస్థాయిలో పాల్గొన్నాడు. అతని ప్రతిభను గుర్తించిన ఎన్ఎస్సీ అకాడమీ.. హైదరాబాద్‌లో ఇంటర్ నేషనల్ క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించింది. అక్కడ సత్తా చాటడంతో అండర్-19లో శ్రీలంకలోని కొలంబోలో నిర్వహించే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు కూడా ఇచ్చారు. అక్టోబరు 20 నుంచి 29 వరకు నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొననున్నాడు.


కప్పుతో గోపరాజు అర్జున్

✦ అర్జున్‌ది నిరుపేద కుటుంబం. రెక్కాడితే కాని డొక్కాడని దుస్థితి. అక్కతోపాటు చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాడు. ఆటలో ఇక్కడి వరకు రావటానికి తల్లిదండ్రులు రూ.లక్ష వరకు అప్పు చేసినట్టు వాపోయాడు.

రోగాలు కొని తెచ్చుకుంటున్నారు..!


పంటలపై పురుగు మందులు పిచికారీ చేస్తున్న రైతు

గరిడేపల్లి, మునగాల, న్యూస్‌టుడే: మానవ శరీరం రసాయనాలతో నిండుతోంది. ఏటా రైతులు వాడుతున్న పురుగు మందుల మోతాదు రెట్టింపవడంతో మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. తెలియకుండానే రోగాలు కొని తెచ్చుకుంటున్నారు. నిబంధనలు పాటించాల్సిన రైతులు, దుకాణం యజమానులు వాటికి తిలోదకాలిచ్చేస్తున్నారు. ఇటీవలి పలు అధ్యయనాలు, సర్వేలూ ఇదే చెబుతున్నాయి.

భారీగా వినియోగం..

రైతులు సాగు చేస్తున్న పంటలో పురుగులు, తెగుళ్లు ఆశిస్తే తక్షణమే నివారించుకోవడానికి రసాయన పురుగుమందులు వాడుతున్నారు. నిదానంగా ప్రభావం చూపేవి, తక్షణమే ప్రభావం చూపేవీ రెండు రకాలు ఉన్నా.. ఎక్కువ మంది రైతులు రెండో రకానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. దాంతో పాటు కంపెనీ, శాస్త్రవేత్తలు చూపిన మోతాదుల కంటే అధనంగా వినియోగిస్తున్నారు.

◆ పంటలపై పిచికారీ చేసిన మందు 10 శాతం ఆశించిన పురుగులు, తెగుళ్లపై ప్రభావం చూపుతుండగా మిగిలిన ద్రావణం కొంత ఆవిరిగా, మరికొంత భూగర్భజలంలో, మరికొంత మనం తినే ఆహార పదార్థాలలో అవశేషాలుగా మిగిలిపోతున్నాయి. రోజు కొంత మొత్తంలో శరీరంలోకి వెళ్తుండటంతో క్రమేపీ ఏదో ఒక వ్యాధికి కారణమవుతున్నాయి.

◆ వాస్తవానికి ఆరోగ్య మంత్రిత్వ శాఖ మానవ ఆరోగ్యంపై తక్కువ ప్రభావం చూపే మందులను సిఫారస్ చేస్తారు. అందుకు భిన్నంగా రైతులు సిఫారస్ కంటే ఎక్కువ మోతాదులో వాడుతున్నారు.

వివిధ కారణాలతో..

పిచికారీ చేసిన తర్వాత పంట కోయడానికి కొంతకాలం వేచి ఉండాలి. వివిధ రకాల పంటలను బట్టి ఐదు రోజుల నుంచి 21 రోజుల వరకు కోయకూడదు. వాడకూడదు.

◆ అందుకు భిన్నంగా పిచికారీ చేసిన రెండు, మూడు రోజుల్లోనే కాయగూరలు కోసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. పంటలో ఏ రకమైన తెగుళ్లు, పురుగు ఆశించిందో అవగాహన లేక కంపెనీల ఏజెంట్లు ఇచ్చిన నాలుగైదు రకాల మందులు కలిపి పిచికారీ చేస్తున్నారు. వాటికి తగ్గకపోతే వారం, పది రోజుల వ్యవధిలోనే మరోసారి పిచికారీ చేస్తున్నారు.

డబ్బాలపై ఉన్నా..

పురుగుమందు డబ్బాలపై విష పూరిత మందుల ప్రభావం ఎంతుంటుందో రంగుల రూపంలో ఇస్తుంటారు. ఎరుపురంగు అత్యధిక విష పూరిత మందుగా, పసుపు రంగు అధిక విష పూరితం, నీలం రంగు ఓ మోస్తరు, ఆకుపచ్చ కొద్దిపాటి విష పూరితమని ఉంటుంది. ఇవేవీ రైతులు, వ్యాపారులు, కంపెనీ ఏజెంట్లు గుర్తించరూ, పట్టించుకోరు. అందుకే అన్ని రకాల మందులను ఒకే మోతాదులో సిఫారస్ చేస్తున్నారు.



రైతులు గమనించాలి: అరిగేల కిరణ్, కేవీకే శాస్త్రవేత్త, గడ్డిపల్లి

రైతులు మోతాదు మించి పురుగు, తెగుళ్ల మందులు వాడకూడదు. తొలిదశలోనే తక్కువ రకం మందులతో అదుపులోకి తేవాలి. జీవ, వృక్ష సంబంధ మందులనే ఎక్కువగా వినియోగించాలి. అత్యవసరమైతేనే రసాయన మందులు వాడాలి.

☛ కూరగాయలు, పండ్లు ఇంటికి తెచ్చిన తర్వాత ఉప్పునీళ్లలో అరగంట నానబెట్టి తర్వాత శుభ్రమైన నీటిలో రెండు, మూడు సార్లు కడిగి వాడాలి. పై తొక్కలను తీసేయడం ద్వారా కొంతమేర అవశేషాలను తొలగించవచ్చు.

ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి


రాజపేటలో వ్యవసాయ క్షేత్రానికి రహదారి నిర్మాణ పనుల్లో ఉపాధిహామీ సాధారణ కూలీలు (పాతచిత్రం)

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే

ట్రాన్స్‌జెండర్లు గౌరవప్రదంగా జీవించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. వారిని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ట్రాఫిక్ వాలంటీర్లుగా నియమిస్తామని ప్రకటించగా, ప్రత్యేక వైద్య సేవలు కూడా అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయమై ఉమ్మడి నల్గొండ జిల్లాలోని భువనగిరి, నల్గొండ, సూర్యాపేట జిల్లా ఆసుపత్రుల్లో త్వరలో మైత్రి ట్రాన్స్ క్లీనిక్‌ల పేరిట వైద్యసేవలు అందుబాటులో తెచ్చేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. వారంలో రెండు రోజులు ట్రాన్స్‌జెండర్లకు ఓపీ సేవలు అందనున్నాయి.

✤ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ట్రాన్స్‌జెండర్లకు మనోధైర్యం కల్పించేందుకు, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉపాధి హామీ పని కల్పించాలని భావించింది. ఈ మేరకు శాఖాపరంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి ట్రాన్స్‌జెండర్‌కు జాబ్‌కార్డు మంజూరు చేయాలని పేర్కొంది. దీనికి సంబంధించి మార్గదర్శకాలు ఇటీవలనే విడుదల చేసింది. పల్లెల్లో ట్రాన్స్‌జెండర్ల గుర్తింపు ప్రక్రియలో సంబంధిత అధికారులు నిమగ్నమయ్యారు.

✤ మరోవైపు ఎస్సీ, ఎస్టీ వర్గాల కూలీల్లో ఇప్పటి వరకు వ్యక్తిగతంగా లబ్ధిపొందిన వారి వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓటు హక్కు కలిగిఉన్నవారు 202 మంది ఉండగా, మరికొందరు ఓటు హక్కు పొందనివారు కూడా ఉన్నట్లుగా తెలుస్తోంది. వీరిలో 18 ఏళ్లు నిండినవారికి ఉపాధి హామీ జాబ్‌కార్డును మంజూరు చేయనున్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటు హక్కు కలిగి ఉన్నవారు..

దేవరకొండ	18
నాగార్జునసాగర్	21
మిర్యాలగూడ	26
నల్గొండ	57
హుజూర్‌నగర్	17
కోదాడ	17
సూర్యాపేట	13
తుంగతుర్తి	7
ఆలేరు	19
భువనగిరి	1
నకిరేకల్	3
మునుగోడు	3

గ్రామాల వారీగా గుర్తింపు ప్రక్రియ

– నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, యాదాద్రి భువనగిరి

జిల్లాలోని గ్రామాల్లో ట్రాన్స్‌జెండర్లను గుర్తించే ప్రక్రియ చేపడుతున్నాం. ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డు మంజూరు చేస్తాం. ప్రత్యేకంగా పని కల్పించి, వసతులు సమకూర్చనున్నాం. వారిపై వివక్ష చూపకుండా ఇతర కూలీలకు పలు రకాలుగా అవగాహన కల్పించే ఏర్పాట్లు చేపడతాం.



మార్గదర్శకాల్లో ముఖ్యాంశాలు ఇవీ..

- ☛ ట్రాన్స్‌జెండర్లకు ఆధార్ ఆధారంగా జాబ్‌కార్డు.
- ☛ గ్రామాల్లో ఇద్దరికంటే ఎక్కువ మంది ఉంటే గ్రూప్‌గా ఏర్పాటు.
- ☛ గ్రూప్ లేక వ్యక్తిగతంగా ఒకే ప్రాంతంలో పని కల్పించేలా చర్యలు.
- ☛ పని ప్రదేశంలో వారిపట్ల ఎలాంటి వివక్ష చూపొద్దు. ఇందుకోసం మేట్లకు అవగాహన కార్యక్రమాలు.
- ☛ ట్రాన్స్‌జెండర్ల సమస్యల కోసం మండల, జిల్లా స్థాయిలో నోడల్ అధికారి నియామకం.

ప్రసాద విక్రయాల్లో మార్పులు?

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో నాణ్యతా ప్రమాణాలు కలిగిన ప్రసాదాల తయారీతో పాటు, విక్రయాలలో సరికొత్త మార్పులు తెచ్చే యోచనలో దేవస్థానం ఉంది. రోజురోజుకు పెరుగుతున్న ఆదరణతో దేవుడి ప్రసాదాలను భక్తులకు సునాయాసంగా చేకూరేలా అధునాతన వనరులు కల్పించనున్నట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఆలయ పరిసరాలలో ఏటీఎం లాంటి ప్రత్యేక యంత్రాలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా భక్తులు తమకు కావాల్సిన ప్రసాదాల టికెట్లను డిజిటల్ పేమెంట్ చేసి, వాటిని పొందే అవకాశం త్వరలోనే అందుబాటులోకి తేనున్నారు. సదరు యంత్రాలను భక్తుల రద్దీ స్థావరాలైన హరి, హర ఆలయాలు, బస్టాండ్, వీవీఐపీ వాహనాల పార్కింగ్, కొండ కింద ఆధ్యాత్మిక వాడలోని వ్రత మండపం, పుష్కరిణి, అన్న ప్రసాదం, బస్ స్టేషన్ ప్రాంగణాల్లో కొత్త వనరుల ఏర్పాటుకు ప్రతిపాదించారు.

ఇప్పటికే..ఒకే సముదాయంలో టికెట్ల విక్రయాలు, ప్రసాదాలను అందజేసే కౌంటర్లు ఉండేవి. సదరు కాంప్లెక్స్‌లో గజిబిజి వాతావరణం ఉండేది. ఆ విధానాన్ని మార్చి టికెట్ కౌంటర్లను ఆలయ ఈవో భాస్కర్ రావు మరో చోట ఏర్పాటు చేసిన విషయం విధితమే. విక్రయాలలో టికెట్ల కౌంటర్, ప్రసాదాలు అందజేసే కౌంటర్లు వేర్వేరుగా ఏర్పాటయ్యాయి. భక్తులకు అనుగుణంగా మరిన్ని మార్పులు రానున్నాయి.



ప్రసాద విభాగం

ప్రమాదం పేరుతో యాపిల్ పండ్లు మాయం!

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: సిమ్లా నుంచి చెన్నైకి ట్రక్కులో యాపిల్స్‌ను తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ప్రమాదం జరిగిందని చెప్పి డ్రైవర్లు వాటిని మాయం చేశారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం వద్ద ఈ నెల 23న చోటుచేసుకుంది.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . హైదరాబాద్ కొత్తపేట పండ్ల మార్కెట్‌లో కందగొండ దత్తాత్రేయ పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. ఆయన సిమ్లాలో భువన్‌సింగ్ అనే వ్యక్తి వద్ద ఈనెల 17న 493 బాక్సుల యాపిల్ పండ్లను కొనుగోలు చేశాడు. వీటి విలువ రూ.15.32లక్షలు ఉంటుంది. వీటిని చెన్నైలో విక్రయించేందుకు కంటైయినర్ ట్రక్కులో తీసుకెళ్తున్నాడు. రవాణా చేసేందుకు ట్రాన్సుపోర్టు కంపెనీకి రూ.1,32,200 చెల్లించాడు. కంటైనర్‌లో పండ్లను తీసుకొని బయలుదేరిన డ్రైవర్లు ఈనెల 23న చౌటుప్పల్ మండలం దండుమల్కాపురానికి చేరుకున్నారు. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై దండుమల్కాపురం వద్ద ప్రమాదం జరిగిందని, లారీ బోల్తా పడటంతో యాపిల్ పండ్లను ఎత్తుకెళ్లారని డ్రైవర్లు భువన్‌సింగ్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. పండ్ల వ్యాపారితో పాటు భువన్‌సింగ్ వచ్చి చూడగా కంటైనర్ ట్రక్కుకు ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. అక్కడ ఇద్దరు డ్రైవర్లు కూడా కనిపించకుండా పారిపోయారు. వారికి ఫోన్ చేస్తే చరవాణి స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఇద్దరు డ్రైవర్లు వీటిని మాయం చేసి ఉంటారని అనుమానంతో పండ్ల వ్యాపారి దత్తాత్రేయ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై యాదవరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ శుక్రవారం తెలిపారు.

కూచిపూడి నాట్య ధీరుడు.. ఈ కుర్రోడు!

తిరుమలగిరి సాగర్, న్యూస్‌టుడే: తపన ఉండాలే కానీ మనిషనుకుంటే ఏదైనా చేసేయగలడు. వాటికనుగుణంగానే ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే తమకంటూ ఓ రంగంపై ఆసక్తి, పట్టుదలను ఏర్పరచుకుంటారు. తల్లిదండ్రులు, గురువులు వాటిని గుర్తించి తగు శిక్షణ ఇప్పిస్తే ఆ రంగంలో ఆరితేరుతారు. ఇలా తమలోని అభిరుచిని పసిగట్టిన పోషకులు అందించిన ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లా, రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయిలో ప్రదర్శనలు చేసి ప్రశంసలతో పాటు అవార్డులు, రివార్డులు పొందుతున్నాడు మండలంలోని నాగార్జునపేటతండాకు చెందిన ఆంగోతు శివకుమార్.

ఇష్టం పెరిగిందిలా..

☛ ఆంగోతు బిక్కు, శాంతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు శివకుమార్. తన ప్రాథమిక విద్య నాగార్జునసాగర్‌లో పూర్తిచేశాడు. అక్కడ జరిగే సంస్కృతి కార్యక్రమాలలో నృత్యాలను చూసి నాట్యమంటే ఇష్టం పెంచుకున్నాడు.

☛ తల్లిండండ్రుల ప్రోత్సాహంతో నాగార్జునసాగర్‌లోని నాట్యశిక్షకుడు దస్తగిరి వద్ద కూచిపూడిలో శిక్షణ తీసుకున్నాడు. 2006లో హాలియాలోని సైన్స్ ఫేర్ కార్యక్రమంలో అప్పటి కలెక్టర్ ముందు కూచిపూడి నృత్యం చేసి ప్రశంసలు పొందాడు.

☛ తన తండ్రి వ్యవసాయ కూలీ అయినా శివకుమార్ కోసం హైదరాబాద్ వెళ్లి ఆటో నేర్చుకుని కుటుంబాన్ని పోషించుకుంటూ కుమారుడిని సికింద్రాబాద్‌లోని రాంకోటిలో శ్రీత్యాగరాజ మ్యూజిక్ కళాక్షేత్రంలో చేర్పించారు.

☛ అక్కడ శివకుమార్ ప్రతిభను గుర్తించిన భరతనాట్య కళాకారుడు విజయ్ సొంత ఖర్చులతో చెన్నై వెంకట చినసత్యం కూచిపూడి ఆర్ట్ అకాడమీలో చేర్పించారు.

☛ అక్కడ వెంపటి శ్రీమోయి వద్ద ఏడాదిన్నర పాటు కూచిపూడిలో శిక్షణ తీసుకున్నాడు. నృత్యంలో అందరినీ ఆకట్టుకునే విధంగా భంగిమలతో తన కళ్లతోనే భావాలను పలికిస్తూ తన నృత్యంతో కట్టిపడేసేవాడు.

☛ అక్కడి నుంచి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లోని శివాన్స్ డాన్స్ అకాడమీని ఏర్పాటు చేసి నాలుగు అకాడమీలలో 200పైగా విద్యార్థులకు కూచిపూడిలో శిక్షణ ఇస్తున్నాడు. దీనితో పాటు చిరంజీవి నటించిన ఆచార్య మూవీలో హీరోయిన్ కాజల్, సంగీతకు కూచిపూడి నాట్యంలో మెలకువలు నేర్పించారు.


నాట్యం చేస్తున్న శివకుమార్

అవార్డులు, ప్రశంసలు..

◆ సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో నిర్వహించిన ప్రదర్శనలో నాట్య చిరోదామి, వరంగల్‌లో నిర్వహించిన పోతన శక్తిపీఠంలో మొదటి బహుమతి రాధేశ్యాం మాస్టారు చేతుల మీదుగా నాట్య కళాధీర అవార్డు, నాట్య నర్తక, నాట్య మయూరి అవార్డులను గెలుపొందాడు.

◆ శ్రీశైలం, విజయవాడ కనకదుర్గ దేవాలయం, శ్రీకాళహస్తి, మహారాష్ట్రలోని వరలక్ష్మి దేవాలయం, హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శ్రీత్యాగరాజ గాన సభ, తెలంగాణ ప్రభుత్వ వజ్రోత్సవ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు పొందారు.

బిస్మిల్లాఖాన్ అవార్డు సాధిస్తా..

– ఆంగోతు శివకుమార్, నాగార్జునపేట, తిరుమలగిరిసాగర్

ఎప్పటికైనా మంచి గురువుగా, నాట్యకళాకారుడిగా పేరు సంపాదించి బిస్మిల్లాఖాన్ అవార్డును సాధిస్తా. ప్రభుత్వ నాట్య కళాశాలలో గురువుగా విద్యార్థులకు కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇవ్వాలని భావిస్తున్నాను.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

మునుగోడు, న్యూస్‌టుడే: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనగా ఇద్దరు మిత్రులు మృతి చెందారు. ఈ ఘటన నల్గొండ జిల్లా మునుగోడు మండలం చొల్లేడు గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడుకు చెందిన నాగరాజు(19) ద్విచక్ర వాహనంపై చొల్లెడు గ్రామానికి వెళ్లి వస్తున్నాడు. అదే సమయంలో మర్రిగూడ మండలం నర్సిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన కె.రామాంజనేయులు(23) తన స్నేహితుడు బొమ్మగోని నరేశ్‌తో కలిసి నల్గొండకు వెళ్లి వస్తున్నారు. ఈ రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన నాగరాజు, రామాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నల్గొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


నాగరాజు


రామాంజనేయులు

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00


సందర్శనకు వచ్చిన వివిధ దేశాల ప్రతినిధులు

శిక్షణ అధికారుల బృందం సందర్శన

కట్టంగూరు, న్యూస్‌టుడే: భారత ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మేనేజ్' కార్యక్రమంలో భాగంగా వ్యవసాయంపై అధ్యయనానికి వచ్చిన ఆఫ్రికా ఖండం, వ్యవసాయ రంగానికి చెందిన అధికారుల బృందం.. మండలంలోని అయిటిపాముల రైతు ఉత్పత్తి దారుల సంఘ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించింది. కేంద్రంలోని నిమ్మకాయల గ్రేడింగ్ యంత్రాన్ని, నిమ్మకాయలతో ఒరుగుల తయారీ విధానాన్ని పరిశీలించారు. సోలార్‌తో పనిచేసే నిల్వ కేంద్రాన్ని, నర్సరీలో కూరగాయల మొక్కల పెంపకాన్ని చూశారు. కేంద్రం పనితీరును, జరుగుతున్న అభివృద్ధిని, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలను అక్కడి సలహాదారులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, ఫౌండేషన్ వ్యవస్థాపకులు కోణం సందీప్ వివరించారు. రైతుల అభివృద్ధికి కోణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సును మేళవించి 'కృషి' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సందీప్ తెలిపారు. కేంద్రం ఛైర్మన్ సైదమ్మ పాల్గొన్నారు.

ఆరుబయట చదువులు

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: పట్టణ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు.



అసంపూర్తి తరగతి నిర్మాణంతో ఆరుబయటే చదువుకుంటున్న విద్యార్థులు

గతంలో ఉన్న పాఠశాల భవనానికి మరమ్మతుల నిమిత్తం అమ్మ ఆదర్శ పాఠశాల కింద నిధులు మంజూరయ్యాయి. నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడం, తరగతి గదులు లేకపోకపోవడంతో ఆరుబయటే తరగతులు నిర్వహిస్తున్నారు. ఉన్న పాఠశాల గదులతో ఒక గదిలో పనికిరాని వస్తువులతో నిండి ఉండటంతో వినియోగంలో లేకుండా పోయింది. కనీసం పనికిరాని వస్తువులను తరలిస్తే ఒక గది అయినా వినియోగంలోకి వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అండర్‌పాస్ వద్ద అంధకారం

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: భువనగిరి బైపాస్‌రోడ్డు టీచర్స్‌కాలనీ అండర్‌పాస్ వద్ద అంధకారంలో నెలకొంది. పట్టణం నుంచి అండర్‌పాస్‌కు వెళ్లే ప్రవేశ, బయటకు వచ్చే మార్గంలో విద్యుద్దీపాలను ఏర్పాటు చేయలేదు. వంతెన లోపల మాత్రమే రెండు విద్యుద్దీపాలు ఏర్పాటు చేసినా రాత్రి వేళలో పూర్తిగా కనిపించకుండా ఉండటంతో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. టీచర్స్ కాలనీ, బొమ్మాయిపల్లి, బీబీనగర్ మండలం ముగ్ధంపల్లి, గొల్లగూడెం ఇతర గ్రామాలు వారు ఈ అండర్‌పాస్ గుండా రాకపోకలు సాగిస్తుంటారు. చీకటిగా ఉండటంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. పూర్తిస్థాయిలో విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని టీచర్స్‌కాలనీకి చెందిన స్థానికుడు న్యాయవాది బొమ్మ వెంకటేష్ డిమాండ్ చేశారు. పరిశీలించి విద్యుద్దీపాలను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ రామాంజుల రెడ్డి తెలిపారు.



టీచర్స్‌కాలనీ అండర్‌పాస్ వద్ద చీకటిమయం

మురుగు.. దారి మీదే పరుగు

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రధాన రహదారి నుంచి పాతగుండ్లపల్లికి వెళ్లే దారిలో మురుగు రహదారిపైనే పారుతోంది. విద్యుత్తు ఉపకేంద్రం, బాలుర, బాలికల హాస్టళ్లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, మజీద్, యాదగిరిపల్లి కాలనీకి వెళ్లడానికి ఈ దారి ప్రధానమైంది. దారిలో వాహనదారులు వెళ్లినప్పుడల్లా మురుగు చిల్లుతూ జనాలకు ఇబ్బందికరంగా మారింది. పైగా దుర్వాసనతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. అంతర్గత మురుగు కాల్వ నిర్మాణం చేసే సమయంలో ఎత్తు, పల్లం చూసి నిర్మాణం చేయకపోవడం వల్ల, మరో కాల్వకు అనుసంధానం చేయకపోవడం వల్ల మురుగు నిండి మ్యాన్‌హోల్ ద్వారా బయటకు వస్తోందని స్థానికులు తెలిపారు. చాలా రోజులుగా ఈ సమస్య ఉందని, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై పుర శానిటేషన్ అధికారి బండి కిరణ్ దృష్టికి తీసుకుపోగా ప్రతిపాదనలు చేసి, కాల్వ అనుసంధానంతో సమస్యను పరిష్కారం చేస్తామన్నారు.



దారిలో నిలిచిన మురుగు నీరు ఇలా..

విద్యుదాఘాతంతో రైతు మృతి

బొమ్మలరామారం: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన బొమ్మలరామారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పెంజర్ల నర్సింహ(50) తన వ్యవసాయ పొలంలో ఉన్న బోరు మోటారును నిలిపివేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడనే మృతి చెందాడు. ఈ విషయం తమ దృష్టికి రాలేదని బొమ్మలరామారం ఎస్సై శ్రీశైలం తెలిపారు.



పెంజర్ల నర్సింహ

వ్యక్తి అదృశ్యం

చౌటుప్పల్‌గ్రామీణం: పురపాలిక పరిధిలోని తంగడపల్లికి చెందిన మహ్మద్ సమీర్(20) ఇంట్లో నుంచి వెళ్లి మరల తిరిగి రాలేదని అతని తండ్రి యూసుఫ్‌ఖాన్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చౌటుప్పల్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో నగదు డ్రా చేస్తానని సమీర్ గురువారం నాడు కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు. మరల ఇంటికి రాలేదని, కుమారునికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుందని తెలిపారు. బంధువుల ఇళ్లలో, ఎక్కడా వెతికినా ఆచూకీ లభించడం లేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

క్రైం రిపోర్ట్

ఎల్లగిరిలో..

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: ఎల్లగిరికి చెందిన జెర్రిపోతుల నర్సింహ(52) ఈ నెల 17న సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లి మరల తిరిగి రాలేదని అతని భార్య యాదమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నర్సింహ మానసిక పరిస్థితి సరిగ్గా ఉండదని, కుటుంబ సభ్యులతో గొడవ పడి అప్పుడప్పుడు ఇంట్లో నుంచి వెళ్లిపోతాడని తెలిపారు. ఇప్పుడు మాత్రం ఇంకా తిరిగి రాలేదని చెప్పారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఔషధాలు సీజ్

మోత్కూరు, న్యూస్‌టుడే: మండలంలోని దత్తప్పగూడెంలో లైసెన్స్ లేకుండా మందులు నిల్వ చేసిన పోలేబోయిన భిక్షపతిపై డ్రగ్స్ యాక్ట్-1940 ప్రకారం కేసు నమోదు చేసినట్లు జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జె.అశ్విన్‌కుమార్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. రూ.30 వేల విలువైన 26 రకాల మందులను సీజ్ చేసినట్లు చెప్పారు. ఆ ఔషధాలను జేఎఫ్‌సీఎం రామన్నపేట కోర్టుకు అప్పగించినట్లు వివరించారు.

సీపీఎం పట్టణ కమిటీ ఎన్నిక

మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరు పట్టణ సీపీఎం కార్యదర్శిగా కూరెళ్ల నరేష్, మహిళా కార్యదర్శిగా తాహేరను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి తెలిపారు. శుక్రవారం పట్టణ కమిటీ మహాసభ స్థానిక సుందరయ్య కాలనీలో జరిగింది.

శ్రీచక్రమహాలయం ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లిలోని రమణేశ్వరంలో దసరా ఉత్సవాల్లో భాగంగా అక్టోబరు 13న రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా శ్రీచక్రమహాలయం ఆవిష్కరణ జరుగుతుందని సిద్ధగురు రమణానందమహర్షి అన్నారు. రమణేశ్వరంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆలయంలో 12 అడుగుల శ్రీచక్రం 1008 ప్రతిష్ఠించనున్నట్లు చెప్పారు. మహామేరు శ్రీచక్ర ఆలయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పార్వతీ పరమేశ్వర శ్రీచక్ర ఆలయాన్ని మంత్రి సీతక్క, త్రిమూర్తి ఆదుగుల శ్రీచక్ర ఆలయాన్ని మంత్రి కొండా సురేఖ ఆవిష్కరిస్తారని చెప్పారు. వివిధ ఆలయాలను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రారంభిస్తారని వివరించారు.

స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించండి

బీబీనగర్, న్యూస్‌టుడే: పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్ డిమాండ్ చేశారు. బీబీనగర్ మండల ఉపాధ్యక్షుడు మంద కిరణ్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిశ్రమల్లో స్థానికులకు 75శాతం అవకాశాలు కల్పించాలని చట్టం ఉన్నా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి బందారు శ్రవణ్, ఉపాధ్యక్షుడు మంద కిరణ్‌కుమార్, బందారు బాను, శ్రవణ్, వినోద్, సంజీవ, శివకుమార్ పాల్గొన్నారు.

పెరటికోళ్ల పంపిణీతో ఆర్థికాభివృద్ధి

బీబీనగర్, న్యూస్‌టుడే: పెరటి కోళ్ల పెంపకంతో మహిళలు అదనపు ఆదాయం పొంది ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. బీబీనగర్ మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహిళలకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.



బీబీనగర్‌లో మహిళలకు పెరటికోళ్లు పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

గ్రామానికి బస్సు ప్రారంభం

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: వీరవెల్లి గ్రామానికి ఉప్పల్ డిపోకు చెందిన బస్సు ఉప్పల్ నుంచి రాయగిరి, కుమ్మరిగూడెం, చందుపట్ల, బండసోమారం మీదుగా వీరవెల్లి వరకు శుక్రవారం ప్రారంభమైంది. ఇప్పటి వరకు యాదగిరిగుట్ట డిపో బస్సు భువనగిరి నుంచి వీరవెల్లి మీదుగా వలిగొండ వరకు నడుస్తోంది. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చొరవతో విద్యార్థులు, వ్యాపారుల సౌకర్యార్థం డిపో మేనేజర్ అదనంగా నూతన బస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి తంగళ్లపల్లి కల్పన, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కంచి లలిత, కంచి మల్లయ్య, శ్రీనివాసాచారి, గ్రామస్థులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు అనుగుణంగా డిజైన్లు రూపొందించాలి

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: మార్కెట్‌కు అనుగుణంగా డిజైన్లు రూపొందించినప్పుడే చేనేత రంగం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ డీవో పర్సన్ ఇన్‌ఛార్జి శ్రీనివాస్‌రావు అన్నారు. పట్టణ కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో 68వ వార్షిక, 66వ సర్వ సభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్రిఫ్ట్ పథకం, బీమా, రుణమాఫీపై ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పురపాలిక ఛైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, సీత సత్యనారాయణ, భారత లవకుమార్, తడ్క వెంకటేశం, ఇందిర, ఆంజనేయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ డీవో పర్సన్ ఇన్‌ఛార్జి శ్రీనివాస్‌రావు

నాణ్యమైన విద్యను అందించాలి: ఎంఈవో లక్ష్మి

ఆలేరు: ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధనతో పాటు మండలంలో ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని ఆలేరు ఎంఈవో ఎర్ర లక్ష్మి అన్నారు. ఎంఈవోగా నియామకమైన నేపథ్యంలో శుక్రవారం పీఆర్టీయూ-టీఎస్ మండల కమిటీ తరఫున సన్మానించారు. పాఠశాలల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం అందిస్తున్న నిధులతో పాటు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తే సహకారం తీసుకోవాలన్నారు. సంఘం మండల అధ్యక్షుడు జి.మధుసూదన్, డా.పి.రంగయ్య, బి.రాములు, పి.సుచరిత, బి.శ్రీనివాస్, ఎం.కాంతారావు పాల్గొన్నారు.



ఎంఈవో లక్ష్మిని పీఆర్టీయూ పరంగా సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గౌడ సంఘం భవనానికి శంకుస్థాపన

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: రెడ్డిబావి గ్రామంలో హెచ్ఎండీఏ నిధులు రూ.10లక్షలతో నిర్మించే గౌడ సంఘం భవనానికి మాజీ జడ్పీటీసీ సభ్యుడు చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు పబ్బు రాజుగౌడ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. బ్లాక్, మండల, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్, నర్సింహగౌడ్, వెంకటేశం, ఆంజనేయులు, పరమేశ్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

యాదగిరిగుట్ట పట్టణం: లాడ్జీల నిర్వాహకులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని యాదాద్రి ఏసీపీ రమేశ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం యాదగిరిగుట్ట ఠాణా వద్ద లాడ్జీ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. లాడ్జీలకు వచ్చే వారి వివరాలు పూర్తిగా పరిశీలించిన తర్వాతే గదులను అద్దెకు ఇవ్వాలని, రిజిస్టర్ నిర్వహణ తప్పనిసరిగా చేయాలని సూచించారు. సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

తెలంగాణలో కమలం వికసించాలి



లక్కారంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.గంగిడి మనోహర్‌రెడ్డి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: తెలంగాణ రాజకీయ క్షేత్రంలో భాజపా వికసిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.గంగిడి మనోహర్‌రెడ్డి తెలిపారు. చౌటుప్పల్ పురపాలిక పరిధి లక్కారంలో శుక్రవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ప్రభుత్వం సమీక్షలతో సరిపుచ్చుతోందని. సంక్షేమ పథకాల అమలులో విఫలమైందని విమర్శించారు. ఇప్పటి వరకు రైతు రుణమాఫీ పూర్తి చేయలేదని, రైతు బంధు జమ కాలేదని అన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, జిల్లా సభ్యత్వ ప్రముఖ్ తూళ్ల వీరేందర్‌గౌడ్, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, చినుకని మల్లేశ్, సుర్వి రాజు, శంకర్, దేవేందర్, శ్రీధర్‌బాబు, జంగయ్య, చిరంజీవి, నర్సింహ, రమేశ్, అశోక్, కృష్ణ పాల్గొన్నారు.

మంచినీటి సహాయకులకు గౌరవం ఉంటుంది



చౌటుప్పల్‌లో ధ్రువపత్రాలు అందజేస్తున్న మిషన్ భగీరథ ఈఈ కరుణాకరన్

చౌటుప్పల్, న్యూస్‌టుడే: గ్రామాల్లో మంచినీటిని అందించే సహాయకులకు ప్రజలు తగిన గౌరవం ఇస్తారని మిషన్ భగీరథ ఈఈ కరుణాకరన్ తెలిపారు. చౌటుప్పల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగు రోజుల శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో.. ఆయన శిక్షణ పొందిన 37 మందికి ధ్రువపత్రాలు అందజేసి మాట్లాడారు. మిషన్ భగీరథ పథకంలో కృష్ణానది నుంచి జలాలను పైపుల ద్వారా నాంపల్లి మండలం లింగోటం తెచ్చి అక్కడ శుద్ధి చేసి వంద కిలోమీటర్ల దూరంలోని చౌటుప్పల్ మండలంలోని ప్రతి గ్రామానికి సరఫరా చేస్తున్నామని తెలిపారు. మిషన్ భగీరథ, సీసాల్లో అమ్మేవి, చేతి పంపు నీళ్లను తెచ్చి వాటిని పరీక్షించి నీటి ప్రయోగశాల విశ్లేషకులు ఝాన్సీ, రాజన్నలు అవగాహన కల్పించారు. ఏఈ విశాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైందని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. జేవియర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం యాదగిరిగుట్టలో నియోజకవర్గ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ.. అంకితభావం, నిబద్ధతతో ఈ వృత్తికి మరింత వన్నె తేవాలని, మంచి తెచ్చుకోవాలని సూచించారు. ఆ సంస్థ అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. సంస్థ నిర్వాహకులు జంగిటి కైలాసం రావు, ఎంఈవోలు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.



యాదగిరిగుట్టలో.. ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తదితరులు

యాదగిరిగుట్ట పట్టణం: ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల హాజరు, ఉత్తీర్ణత శాతం పెంచాలని, దీనికి అందరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సూచించారు. శుక్రవారం యాదగిరిగుట్ట ప్రభుత్వ జూనియర్ కళాశాలను అకస్మికంగా సందర్శించారు. తక్కువ శాతం ఉన్న విద్యార్థుల హాజరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాలలో సమస్యలపై అడుగగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, బస్టాండ్ నుంచి కళాశాలకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని, కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం చేయాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.మంజుల, అధ్యాపకులు రాంబాబు, అసహల్, రాజు, హైమావతి, కృష్ణ, రమేశ్ పాల్గొన్నారు

ఆలేరు: ఆలేరు పురపాలికకు అమృత్ 2.0 పథకంలో మంజూరైన రూ.12 కోట్లతో చేపట్టనున్న పనులకు ప్రభుత్వవిప్ బీర్ల అయిలయ్య శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఐదు నెలల్లో నిర్మాణ పనులు పూర్తవుతాయన్నారు. వచ్చే వేసవి ప్రారంభం నాటికి తాగునీటి ఎద్దడి లేకుండా లేకుండా చేస్తామన్నారు. పుర ఛైర్మన్ వస్పరి శంకరయ్య, కమిషనర్ కె.లక్ష్మి, కౌన్సిలర్లు, పురపాలిక ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికతో విద్యుత్తు పనులు: ఎమ్మెల్యే

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శేరిల్లా గ్రామంలో నూతనంగా నిర్మించిన 33-11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం రాత్రి ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యుత్‌శాఖ ఎస్ఈ సుధీర్‌బాబు, డీఈ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఏడీ శ్యాంకుమార్, ఏఈ సతీశ్, తెలంగాణ మున్సిపల్ ఛాంబర్ ఛైర్మన్ రాజు వెన్‌రెడ్డి, చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, కాయితి రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.



శేరిల్లాలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్: పక్కా ప్రణాళిక ప్రకారం విద్యుత్తు పనులు 2025 మార్చి నాటికి పూర్తి చేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆ శాఖ అధికారులకు సూచించారు. చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాలకు మంజూరైన రూ.20 కోట్ల నిధులతో చేపట్టాల్సిన పనులపై స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సమీక్షించారు. ప్రమాదాలకు తావులేకుండా నాణ్యమైన విద్యుత్తును అందించాలని ఆదేశాలిచ్చారు.

విద్యుత్ నియంత్రిక ప్రారంభం

మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరు పురపాలక పరిధిలోని కొండాపురంలో శుక్రవారం 100 కేవీ విద్యుత్తు నియంత్రికను శుక్రవారం పుర ఉపాధ్యక్షుడు బి.వెంకటయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు డాక్టర్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, గుండగోని రామచంద్రుగౌడ్, రమేష్, లెంకల వేణు, రమేష్, మధు, రామచంద్రయ్య, నవీన్ పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో క్రీడలను ప్రోత్సహించాలి

బీబీనగర్: గ్రామాల్లో క్రీడలను ప్రోత్సహించాలని కాంగ్రెస్ నాయకులు పింగళిరెడ్డి అన్నారు. బీబీనగర్ మండలం భట్టుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న 68వ మండల స్థాయి పాఠశాలల క్రీడోత్సవాలకు శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మండల విద్యాశాఖాధికారి సురేశ్‌రెడ్డి, భట్టుగూడెం హెచ్ఎం దివాకర్ పాల్గొన్నారు.

నీటిశుద్ధి ప్లాంట్ ప్రారంభం

గుండాల, న్యూస్‌టుడే: గుండాల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పాఠశాల పూర్వ విద్యార్థి దేవవబోయిన అయిలయ్య సహకారంతో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి ప్లాంట్‌ను డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.చంద్రకళ, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు ఎండీ.షర్ఫోద్దీన్, ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరిగౌడ్, ప్యాక్స్ ఛైర్మన్ లింగాల భిక్షమయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

భువనగిరి: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీజీవో జిల్లా అధ్యక్షుడు జగన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, టీజీవోల సంఘం రాష్ట్ర కోశాధికారి మండడి ఉపేందర్‌రెడ్డి శుక్రవారం కలెక్టర్ హన్మంత్ కె.జెండగేను కలిశారు. సంఘం అసోసియేట్ అధ్యక్షురాలు కవిత, ఉపాధ్యక్షురాలు అంబిక, యాకుబ్, నాయకులు సైదులు, డాక్టర్ చంద్రారెడ్డి, ప్రవీణ్‌కుమార్, హరికృష్ణ పాల్గొన్నారు.

ప్రతి ఊరు, గుడికో జమ్మి చెట్టు

భువనగిరి, న్యూస్‌టుడే: దసరా పండగ సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ మరో వినూత్న కార్యక్రమానికి చుట్టబోతున్నట్లు మాజీ రాజ్యసభ సభ్యుడు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఫౌండర్ జోగినపల్లి సంతోష్ కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వృక్షం జమ్మిని ప్రతి ఊరిలో, ప్రతి గుడిలో నాటించాలని సంకల్పించినట్లు వెల్లడించారు. భువనగిరి శివారులోని స్వర్ణగిరి క్షేత్రాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన ఊరు ఊరికో జమ్మిచెట్టు.. గుడిగుడికో జమ్మిచెట్టు కార్యక్రమ పోస్టర్‌ను ఆలయ ధర్మకర్త, ఆలయ ప్రధాన అర్చకుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. దసరా పండుగ రోజు ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా జమ్మి మొక్కను నాటి ప్రారంభించనున్నామన్నారు. తొలుత శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న సంతోష్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మానేపల్లి రామారావు స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో జమ్మి మొక్కను నాటారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జోగినపల్లి సంతోష్‌కుమార్, చిత్రంలో ఆలయ ధర్మకర్త రామారావు

వృత్తి నైపుణ్యాలతోనే ఉన్నత శిఖరాలు

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నత శిఖరాలను అందుకోవాలంటే విద్యార్థులు వృత్తి నైపుణ్యంలో రాణించాల్సిన ఆవశ్యకత ఉందని బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ సరితా సత్పతి అన్నారు. దేశ్‌ముఖి గ్రామంలోని విజ్ఞాన్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బీబీఏ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ అవగాహన కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా బోధిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం డైరెక్టర్ సుబ్బారావు, సునీల్, శివకుమార్, కల్పన, ఆయా విభాగాల సమన్వయకర్తలు, అనిల్‌కుమార్, నాగరాజు, అమీనా, సయ్యద్ మహబూబ్ పాల్గొన్నారు.



వేడుకలు ప్రారంభిస్తున్న డాక్టర్ సరితా సత్పతి

పీపుల్స్ ప్లాజాలో పుట్టపాక వస్త్ర ప్రదర్శన


సంస్థాన్ నారాయణపురం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని పీపుల్స్‌ప్లాజాలో సరస్ ఫెయిర్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో పుట్టపాక ఖుషి శ్రీ టైఅండ్‌డై హ్యాండ్లూమ్స్ ఇక్కత్ ప్రొడక్షన్ వారు శుక్రవారం పుట్టపాక చేనేత వస్త్ర ప్రదర్శన చేశారు. పుట్టపాకలో తయారైన తేలియారుమాల్, సిల్క్ చీరలు, ఫ్యాబ్రిక్ ఇక్కత్ టాప్స్, ఇక్కత్ టవల్స్, లుంగీలు, బెడ్‌షీట్స్ వస్త్రాలను విక్రయించారు. గజం స్వప్న, గడ్డం వెంకటయ్య, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

లక్ష్మణ్‌బాపూజీకి ఘన నివాళులు



మోత్కూరులో కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి వేడుకలు శుక్రవారం ఆలేరులో ఘనంగా జరిగాయి. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాలలో తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో సత్యాంజనేయప్రసాద్, పద్మశాలి సంఘాల నాయకులు మాట్లాడారు. తుర్కపల్లి మండల పరిషత్తు కార్యాలయంలో లక్ష్మన్‌బాపూజీ జయంతి నిర్వహించారు. రామన్నపేటలో శుక్రవారం లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామన్నపేట, వెల్లంకి గ్రామాల్లో పద్మశాలి సంఘం నాయకులు నివాళులర్పించారు. ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ ఈ ప్రాంత ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, అసెంబ్లీ స్పీకరుగా పలు సేవలందించారని ఆయన పేరిట నెలకొల్పిన సేవా సమితి అధ్యక్షుడు బడుగు లక్ష్మయ్య తెలిపారు. సేవా సమితి ఆధ్వర్యంలో చౌటుప్పల్‌లో బాపూజీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అన్నదానం చేశారు. ఆత్మకూరు(ఎం) ఎంపీడీవో కార్యాలయంతో పాటు వివిధ సంఘాల నాయకులు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి జరిపారు. సంస్థాన్ నారాయణపురంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమాన్ని విగ్రహ ప్రతిష్ఠ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంస్య విగ్రహానికి పూల మాలలు వేశారు. మోత్కూరు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొని బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అడ్డగూడూరు ఎంపీడీవో, తహసీల్దార్ తదితర కార్యాలయాల్లో జయంతి నిర్వహించారు. భూదాన్‌పోచంపల్లిలోని చేనేత సహకార సంఘం ఆవరణలో లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పించారు. చౌటుప్పల్ పురపాలిక కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద పురపాలిక ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు పూలమాలలు వేశారు. భువనగిరి పురపాలక సంఘం కార్యాలయంలో జరిగి కార్యక్రమంలో పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ రామాజులరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు. బొమ్మలరామారం ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలలో నిర్వహించారు. యాదగిరిగుట్టలోని అఖిల భారత పద్మశాలి అన్నసత్రం కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని యాదగిరిగుట్ట అధ్యక్షుడు కత్తుల సుదర్శన్‌రావు, స్థానిక నాయకులు, కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఉదయం అఖిల పక్షం, పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం వద్ద ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. రాజపేటలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రఘునాథపురం, రేణికుంట, బేగంపేట గ్రామాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లోనే బాపూజీ జయంతి వేడుకలు జరిపారు. -న్యూస్‌టుడే, బృందం



చౌటుప్పల్‌లో..



యాదగిరిగుట్టలో విగ్రహావిష్కరణ